


సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
కర్నూలు నంద్యాల
బుధవారం | 25 జూన్ 2025
పేజీలు 8

# 100 టిఎంసిలకు చేరిన శ్రీశైలం జలాశయం

- నిరుడుతో పోలిస్తే ఈ ఏడు 50 రోజుల ముందుగానే ప్రారంభమైన నీటి చేరిక
- గతేడాది ఇదే సమయానికి డ్యాంలో ఉన్నది కేవలం 37 టిఎంసిలే
- జలాధివాసంలోకి సంగమేశ్వరుడు
- త్వరగా సాగునీటిని విడుదల చేయాలంటున్న రైతాంగం
- ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూపులు..


జలాధివాసమైన సంగమేశ్వరాలయం దృశ్యం

శ్రీశైలం జలాశయంలోకి వరద ప్రవాహం కొనసాగుతోంది. మంగళవారం సాయంకాలం సమయానికి డ్యాంలో నీటి నిల్వ 101 టిఎంసిలకు చేరింది. డ్యాంలోకి జూరాల స్పిల్ వే నుండి 27,419 క్యూసెక్‌లు, విద్యుత్ ఉత్పత్తి అనంతరం 33,931 క్యూసెక్‌ల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నిరుటితో పోలిస్తే 50 రోజుల ముందుగానే శ్రీశైలం డ్యాంలో నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. ఏడాది క్రితం ఈ సమయానికి డ్యాంలో కేవలం 37.405 టిఎంసిల నీరు మాత్రమే నిల్వ ఉండింది. 2024లో డ్యాంలో జూలై 26వ తేదీన 100 టిఎంసిలకు నీటి నిల్వ చేరింది. ఈ ఏడాది మే నెల నుండే శ్రీశైలం జలాశయంలోకి నీటి చేరిక ప్రారంభమైన విషయం తెలిసిందే. దాదాపు 40 సంవత్సరాల తర్వాత మే నెల నుండే జలాశయంలోకి నీటి చేరిక ప్రారంభం కాగా, జూన్‌లో 100 టిఎంసిల నీరు చేరడం ఇదే తొలిసారి. శ్రీశైలం జలాశయంలోకి వరదనీటి చేరిక క్రమేణా పెరుగుతుండడంతో రైతాంగంలో ఆనందం కనిపిస్తోంది. కర్నాటకలో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణా నదిలో నీటి ప్రవాహం పెరుగుతోంది. ఫలితంగా తెలంగాణాలోని జూరాల ప్రాజెక్టు వద్ద స్పిల్‌వే గేట్లు ఎత్తి నదిలోకి నీటిని విడుదల చేస్తుండగా, మరోవైపు విద్యుత్ ఉత్పత్తి అనంతరం కూడా నీటిని శ్రీశైలంకు విడుదల చేస్తున్నారు.

కర్నూలు, మేజర్‌న్యూస్ బ్యూరో

2లో


శ్రీశైలం డ్యాంలో నీరు నిలువ ఉన్న ముందు భాగం దృశ్యం (ఫైల్‌ఫోటో)

## ఆంధ్ర ఇసుక కర్ణాటక కాసులు

- తుంగభద్రలో కర్ణాటక తోడేళ్ళు..
- ఇక్కడ ఉచితం-అక్కడ కాసుల వర్షం..
- కర్ణాటక వైపు ఇసుకను తరలిస్తున్న కర్ణాటక కేటుగాళ్ళు..

**కోసిగి మేజర్ న్యూస్:** తుంగభద్రానదిలో కర్ణాటక ఇసుక తోడేళ్ళు పడి ఆంధ్రవైపు ఉన్న ఇసుకను కర్ణాటక వైపుకు తరలిస్తూ కర్ణాటకలో కాసుల వర్షం తీసుకుంటున్నారు. తుంగభద్ర నదిలో నీటిమట్టం తగ్గడంతో కర్ణాటక రాష్ట్రానికి చెందిన మిగతా 2లో


ఇసుకను ట్రాక్టరలో వేస్తున్న కూలీలు

## అమాయకులే లక్ష్యంగా నేరాలు

- ఏపీకే ఫైల్స్ లింకులను ఎవరూ క్లిక్ చేయ్యొద్దు
- కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్


మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** సైబర్ నేరగాళ్లు అమాయకులే లక్ష్యంగా నేరాలకు పాల్పడుతున్నారని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేసేందుకు కొత్త పద్దతులను మిగతా 2లో

## కలెక్టరేట్ ఎదుట పొగాకు రైతుల ఆందోళన

- రైతులు, పోలీసుల మధ్య తోపులాట


పొగాకు రైతులు ఆందోళన చేస్తున్న దృశ్యం

# మల్లన్న ఉచిత స్పర్శదర్శనం పునఃప్రారంభం



- భక్తుల సౌకర్యార్థం జూలై 1 నుంచి స్వామివారి స్పర్శ దర్శనం
- గతంలో లాగానే మంగళవారం నుంచి శుక్రవారం వరకు ఉచిత స్పర్శదర్శనం
- స్పర్శదర్శనానికి సాంప్రదాయ వస్త్రాధారణ తప్పని సరి..
- ఉచిత స్పర్శ దర్శనానికి ఏరోజుకారోజు టోకన్లు జారీ
- ఊహించని విధంగా భక్తుల రద్దీ ఉంటే స్పర్శదర్శనం నిలుపుదల
- శ్రీశైల దేవస్థానం ఈవో యం. శ్రీనివాసరావు

2లో

సూర్య www.suryaa.com



# 100 టీఎంసిలకు చేరిన శ్రీశైలం జలాశయం

(మొదటి పేజీ తరువాయి)

శ్రీశైలం జలాశయంలో 215 టీఎంసిల నీటిని నిల్వ చేసే అవకాశం ఉండగా, ప్రస్తుతం నీటి మట్టం 101 టీఎంసిలకు చేరింది. 50 టీఎంసిల దిగువకు నీటి నిల్వలు పడిపోతే జలాశయం దాదాపు డెడ్‌స్టోరేజ్‌కు చేరినట్లేనన్నది నిపుణులు చెబుతున్న మాట. డ్యాంలో పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, మంగళవారం నాటికి అది 858.60 అడుగులకు చేరింది. శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం 850 అడుగులకు చేరుకుంటే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుండి రాయలసీమకు నీటిని మళ్లించుకునే అవకాశం ఉంది. శ్రీశైలం వద్ద నీటి మట్టం 850 అడుగులకు తగ్గకుండా చూసుకోవాలన్న ప్రభుత్వ ఆదేశాలున్నా ఒక వైపు తెలంగాణా విద్యుత్ ఉత్పత్తి పేరుతో, మరోవైపు మహాత్మా గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి నీటిని మళ్లించుకుపోవడం ప్రతి ఏటా కొనసాగుతునే ఉంది. 2019 తర్వాత దాదాపు నాలుగేళ్ల పాటు శ్రీశైలం జలాశయం లోకి వచ్చిన నీటిని వచ్చినట్లు తెలంగాణా దిగువకు తరలించుకు పోవడంతో రాయలసీమలో సాగు, తాగునీటికి కటకట ఏర్పడిన విషయం తెలిసిందే. తెలంగాణా వ్యవహారంపై జోక్యం చేసుకోవాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడంతో కృష్ణా, గోదావరి నదులపై ప్రాజెక్టుల నిర్వహణను ఆయా బోర్డులకు అప్పగించాలని కేంద్రం ఆదేశాలిచ్చింది. కేంద్రం ఆదేశాలను తెలంగాణా ప్రభుత్వం పట్టించుకోని కారణంగా శ్రీశైలంలో భారీగా వరద జలాలు వచ్చి చేరినా రబీ పంటలకు నీళ్లందక రాయలసీమ రైతాంగం కన్నీళ్లకే పరిమితమైంది. ఈ ఏడు ఇప్పటికే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ గేట్లను ఎత్తేందుకు వీలుగా అవసరమైన జలాలు శ్రీశైలం జలాశయంలోకి ఇప్పటికే చేరిన కారణంగా వెంటనే రాయలసీమకు నీటిని అందించేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.

తుంగభద్ర డ్యాంలోకి కూడా వరద నీరు వచ్చి చేరుతోంది. గేట్లకు మరమ్మత్తుల కారణంగా పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేయలేమని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసింది. తుంగభద్ర నదీ జలాలను ఈ ఏడాది కేవలం ఖరీఫ్‌కు మాత్రమే ఇస్తామని జలవనరులశాఖ స్పష్టం చేస్తుండగా, రబీకి క్రాప్ హాలిడే ప్రకటించినట్లే భావించాల్సి వస్తోంది. తుంగభద్ర డ్యాంలో 105.788 టీఎంసిల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉండగా, డ్యాంలో ప్రస్తుతం 48.27 టీఎంసిల నీరు నిల్వ ఉంది. డ్యాంలోకి 23,366 టీఎంసిల నీరు వచ్చి చేరుతోంది. పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసుకునే అవకాశాలుండవని స్పష్టమవుతున్న నేపథ్యంలో వెంటనే నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే జూలై 15వ తేదీ తర్వాత నీటిని విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు. కెసి కెనాల్‌తో పాటు ఎల్ఎల్‌సి కింద ఆయకట్టు రైతులకు కూడా ఈ ఏడాది కష్టాలు తప్పేలా లేవు. శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం 100 టీఎంసిల ఎగువకు చేరడంతో సప్తనది సంగమ క్షేత్రమైన సంగమేశ్వరంలోని శివాలయం పూర్తిగా జలాధివాసంలోకి వెళ్లిపోయింది. శిఖరం పూర్తిగా నీటిలో మునిగిపోయింది. మళ్లీ నాలుగైన నెలల తర్వాత సంగమేశ్వరుడు జలాధివాసం నుండి బయటపడతాడు.

# మల్లన్న ఉచిత స్పర్శదర్శనం పునఃప్రారంభం

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** భక్తుల సౌకర్యార్థం జూలై 1వ తేదీ నుంచి శ్రీ స్వామివార్ల ఉచిత స్పర్శదర్శనం పున:ప్రారంభించబడుతుంది. గతంలో వలనే వారంలో నాలుగు రోజులపాటు అనగా మంగళ, బుధ,గురు,శుక్రవారాలలో ఈ ఉచిత స్పర్శదర్శనం కల్పించబడుతోంది.ఆ రోజులలో 2 గంటల పాటు అనగా మధ్యాహ్నం 1.45 గంటల నుంచి 3.45 గంటల వరకు ఈ ఉచిత స్పర్శదర్శనం కొనసాగుతుంది.ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సామాన్య భక్తులకు ప్రాధాన్యత నిస్తూ,శ్రీ మల్లికార్జున స్వామివారిని స్వయంగా స్పర్శించడం ద్వారా ఆధ్యాత్మిక అనుభూతిని పొందాలనే ప్రతీ భక్తుడి కోరికకు అనుగుణంగా ఈ ఉచిత స్పర్శదర్శన సౌకర్యం పునః ప్రారంభించడం జరుగుతోందన్నారు.సామాన్య భక్తులు ఎటువంటి రుసుమును చెల్లించకుండా ఉచితంగా శ్రీస్వామివారి స్పర్శదర్శనం చేసుకునేందుకు ఈ అవకాశం కల్పించడుతోందన్నారు.ఉచిత స్పర్శదర్శనంలో కూడా జవాబు దారీతనం,పారదర్శకత కోసం కొత్తగా టోకన్ విధానాన్ని ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. ఉచిత దర్శనం కోసం ఏరోజుకారోజు కౌంటర్ల ద్వారా టోకన్లను జారీ చేయబడుతాయన్నారు.ఈ కంప్యూటరైజుడు టోకన్లలో భక్తుని పేరు,ఆధార్ నెంబరు,ఫోన్ నెంబరును నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ టోకన్లను ఉచిత దర్శనం ప్రవేశద్వారం వద్ద గల స్కానింగ్ ద్వారా తనిఖీ చేసి భక్తులను ఉచిత స్పర్శదర్శనానికి అనుమతించడం జరుగుతుందన్నారు.అవకాశాన్ని బట్టి రోజుకు 1000 నుంచి 1200టోకన్లుజారీ చేయబడుతాయన్నారు.టోకెన్లు పొందిన భక్తులు మాత్రమే ఉచిత స్పర్శదర్శనానికి అనుమతించడం జరుగుతుందన్నారు.కావున ఉచిత స్పర్శ దర్శనాన్ని పొందగోరే భక్తులు తప్పనిసరిగా ఈఉచిత టోకన్లను పొందవలసి వుంటుందన్నారు.ఈ ఉచిత స్పర్శదర్శన సమయంలో రూ.300/-లు మరియు రూ.150/-లతో గల అలంకార దర్శన కౌంటర్లు, క్యూలైన్లు నిలుపుదల చేయబడుతాయన్నారు. ఉచిత దర్శనం భక్తులను కేవలం ఉచిత దర్శన క్యూలైన్ ద్వారా మాత్రమే అనుమతించడం జరుగుతుందన్నారు.ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి ఉచిత స్పర్శదర్శనానికి వచ్చే భక్తులు తప్పనిసరిగా సంప్రదాయ దుస్తులతో రావలసి వుంటుందన్నారు. అదేవిధంగా పురుషులు తెల్ల పంచ,మెడలో తెల్లకండువాను, మహిళలు చీర,రవికను లేదా చున్నీతో కూడిన సల్వార్ కమీజ్లను ధరించవలసివుంటుందన్నారు.కాగా గతంలో వలనేభక్తులరద్దీ కారణంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు,ఉగాది మహోత్సవాలు,దసరా మహోత్సవాలు,శ్రావణమాసం,కార్తికమాసం,ప్రభుత్వ సెలవురోజులలో ఈ ఉచిత స్పర్శదర్శనానికి అవకాశం ఉండదు.సదరు సమాచారమును ఎప్పటికప్పుడు ముందస్తుగా తెలియజేయడం జరుగుతుందన్నారు.గతంలో ఉన్నట్లుగానే ఎప్పుడైనా ఊహించని విధంగా అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసిన సందర్భంలో ఈ స్పర్శదర్శనంనిలుపుదలచేయడంజరుగుతుందనిఈవో పేర్కొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట పొగాకు రైతుల ఆందోళన

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నంద్యాల జిల్లాలోని పొగాకు వేసిన రైతాంగం గత రెండు నెలల నుంచి ఆందోళన చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేట్ కంపెనీలు రైతుల వద్ద ఉన్న మొత్తం పొగాకును కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నందున ఆగ్రహించిన రైతాంగం నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జాతీయ రహదారిపై అడ్డంగా కూర్చుని రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ కంబగిరి రాముడు పోలీస్ సిబ్బందితో రైతులకు ఆందోళన విరమించే ప్రయత్నం చేయగా జిల్లా కలెక్టర్ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసే విషయంపై హామీ ఇచ్చే వరకు రైతులను మోసం చే స్తున్న పొగాకు కంపెనీల పైన కఠినమైన చర్యలు తీసుకునే వరకు ఆందోళన విరమించేది లేదని రైతాంగం పట్టువదలకుండా కూర్చున్నారు. సీఐ జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడి రైతులు ఆయన వద్దకు తీసుకుని వెళతానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ రైతు సంఘాల నాయకులు రైతులతో పొగాకు కొనుగోలులో జరుగుతున్న లోపాలపై చర్చించి మూడు రోజులలోపు ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ప్రైవేట్ కంపెనీల విషయంపై స్పష్టత ఇచ్చి రైతులకు న్యాయం జరిగేలా చర్య తీసుకుంటానని హామీనిచ్చారు. ఈకార్యక్రమంలో ఏపీ రైతు సంఘం ప్రధాన అధ్యక్షుడు రమేశ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సహాయ కార్యదర్శి రామచంద్రులు మాట్లాడుతూ ప్రైవేట్ పొగాకు కంపెనీలు ఒప్పందం చేసుకున్న మేర కూడా కొనుగోలు చేయకపోవడం 18వేలకు క్వింటాలుకు ఇవ్వాల్సిన కంపెనీలు 7వేల నుంచి 10వేలు లోపు ఇస్తూ రైతులను దోపిడీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు ఏమాత్రం పట్టించుకోకుండా రైతుల పట్ల పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు ప్రభుత్వం ఒత్తిడి పెట్టి రైతులందరి పొగాకును కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అలా జరగని పక్షంలో భవిష్యత్తులో రైతాంగం పోరాటాలు చేస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు, 16మండలాల పొగాకు రైతులు, రైతు సంఘం నాయకులు నరసయ్య, పుల్లారెడ్డి, నారాయణ, రామ్మోహన్, వీరన్న, రామకృష్ణ, బుజ్జన్న, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పొగాకు రైతులు

# ఆంధ్ర ఇసుక-కర్ణాటకకు కాసులు

(మొదటి పేజీ తరువాయి)





ఇసుకను తరలిస్తున్న తరలిస్తున్న ట్రాక్టరు, తుంగభద్రనదిలో ఇసుకను తోడేస్తున్న కర్ణాటక తోడేళ్ళు

తమాపూర్ గ్రామానికి చెందిన యాభైకుపైగా ట్రాక్టర్లతో ఆంధ్రవైపు ఉన్న ఇసుకను తరలిస్తూనే ఉన్నారు. దాదాపుగా నెలరోజులు కావస్తున్నా.. తోడేళ్ళ వలే ఇసుకను తోడేస్తూ ఆంధ్రవైపు ఉన్న ఇసుకను ఖాళీ చేస్తున్నారని ఆంధ్రవైపు ఉన్న గ్రామస్తులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. దాదాపుగా రోజుకి 50నుంచి 100కుపైగా ఇసుక ట్రాక్టర్లతో తరలిస్తుండడంతో ఆంధ్రవైపు ఉన్న ఇసుక ఖాళీ అయ్యే పరస్థితి ఉందని దీనివల్ల నదికోత ఎక్కువ అయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆంధ్రవైపు ఇసుక ప్రభుత్వం ఉచితంగా ఇవ్వడంతో కర్ణాటక రాష్ట్ర ఇసుక మాఫియాకు వరంలా మారింది. దీనితో ఇసుకను తరలిస్తూ కాసులు చేసుకుంటున్నారు. ఇలాగే కొనసాగితే పరిస్థితి దారుణంగా ఉంటుందని ఇప్పటికై నా అధికారులు ఆంధ్రవైపు ఉన్న ఇసుక అక్రమాన్ని అరికట్టాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

# అమాయకులే లక్ష్యంగా నేరాలు

(మొదటి పేజీ తరువాయి)

అనుసరిస్తున్నారన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపిన ఏపికె ఫైల్స్ లింకులను క్లిక్, డౌన్‌లోడ్ చేయకూడదన్నారు. ఏపికె ఫైల్స్‌ను క్లిక్ చేసినట్లయితే మీ వాట్సప్‌ను కూడా సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేస్తారన్నారు. దీంతో మీ ఫోన్ హ్యాక్ అయి సైబర్ నేరగాళ్లచే మోసపోతారన్నారు. కొన్నిసార్లు యుపిఐ యాప్‌లను కూడా నేరుగా యాక్సెస్ చేసి ఖాతాల్లోని డబ్బును దొంగలిస్తారన్నారు. మోసపోయిన వారు వెంటనే 1930కు కాల్ చేయాలని, అలాగే వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని, మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజలందరు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

## సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** గత ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎమ్మిగనూరు సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ శేషఫణిలకు వారు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ ప్రమోషన్ ఛానెల్స్, ఇంక్రిమెంట్లు, మాతృ శాఖ కేటాయింపు, జాబ్ చార్ట్ లాంటి కీలక అంశాలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రారంభించిన బదిలీల ద్వారా హేతుబద్ధీకరణ ప్రక్రియపై ఉద్యోగులలో తీవ్రమైన ఆందోళన నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ దిగులు పాల్గొన్నారు.



కమిషనర్ కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఉద్యోగులు

## ఎల్ కె ఆర్ గ్లోబల్ స్కూల్ లో ఘనంగా సైకిల్ డే

**- సైకిల్ తొక్కడం వల్ల శారీరక ఫిట్‌నెస్ వస్తుంది- ఎల్ కె ఆర్ గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ కళ్యాణ్ కుమార్ రెడ్డి**

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** పట్టణంలోని పద్మావతి నగర్ లో ఉన్న ఎల్ కె ఆర్ గ్లోబల్ స్కూల్లో సైకిల్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ కళ్యాణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ శారీరకంగా దృఢంగా ఉండేందుకు, వ్యాధుల బారి నుంచి రక్షణకు సైకిల్? తొక్కడం మంచిదన్నారు.సైకిల్ తొక్కడం వల్ల వాతావరణంలో కాలుష్యం తగ్గడం తోపాటు ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. సైకిల్ తొక్కడం వల్ల శారీరక, ఫిట్‌నెస్ వస్తుందని, రోగనిరోధక శక్తి పెంచుతుందన్నారు. కాలుష్యం తగ్గించే సైకిల్ ప్రయాణం ఎంతో శ్రేయస్కరం అన్నారు. సైకిల్ తొక్కడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు.





# ఘనంగా దేవర్షి నారద మహర్షి జయంతి


మాట్లాడుతున్న డాక్టర్ రామకృష్ణారెడ్డి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని టెక్కె భారతమాత మందిరం రోడ్డులోని విశ్వహిందూ పరిషత్ కార్యాయంలో సాహితీ సుధా ఫౌండేషన్, విహెచ్‌పిల ఆధ్వర్యంలో విశ్వ పాత్రికేయులు శ్రీ నారద మహర్షి జయంతి ఉత్సవాలు జరిగాయి. సమాచార రంగంలో విశేష కృషి చేస్తూ సమాజ చైతన్యానికి, అభివృద్ధికి పాటుపడుతున్న పాత్రికేయులను సన్మానించారు. నంద్యాల జిల్లా సంఘ చాలక్ చిలుకూరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి రామకృష్ణా డిగ్రీ కళాశాలల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, శాంతినికేతన్ పాఠశాలల అధినేత సుధాకర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ కరూప్నలు విభాగ్ సహ సంపర్క్ ప్రముఖ్ పరుశురాముని రామకృష్ణ ప్రధానవక్తగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో కర్నూలు విభాగ్ సహ కార్యవాహ రామాంజనేయులు, విభాగ్ ప్రౌఢ ప్రముఖ్ రాంప్రసాద్, సక్షం జిల్లా అధ్యక్షులు నేట్ల మహేశ్వరరెడ్డి, జిల్లా ప్రచార ప్రముఖ్ రవి, జిల్లా సహ ప్రచార ప్రముఖ్ శ్రీనివాసులు, నగర ప్రచార ప్రముఖ్ చింతలపల్లె వాసు, పాలూరి సుబ్బారావు, నరేంద్రతో పాటు జిల్లా ప్రింట్ మీడియా అధ్యక్షులు మధు, గౌరవాధ్యక్షులు మాం జనార్ధన్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చలంబాబు, గౌరవాధ్యక్షులు శశిశేఖర్‌శర్మతో పాటు సీనియర్ పాత్రికేయులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహర్షి నారదుల వారు కలహ భోజనుడు అనే నిందను మోస్తూ కూడా ముల్లోకాలు పర్యటించి విశ్వ కల్యాణం కోసం కృషి చేశారని తెలిపారు. అదే విధంగా పాత్రికేయులు కూడా సమాజంలో ఎనో ఒత్తిడుల మధ్య పనిచేస్తూ సమాజం హితం కోసం కృషి చేస్తున్నారని కొనియాడారు. నేటి సామాజిక పరిస్థితులలో విలువలతో కూడిన సామాజిక నిర్మాణం కోసం, చీకటి మాటున జరుగుతున్న అసాంఘిక , దేశ విద్రోహ కార్యకలాపాలను వెలుగులోకి తెచ్చి సమాజాన్ని చైతన్యపరచడమే పాత్రికేయుల ప్రధాన బాధ్యత అని ఉద్ఘాటించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా పంచ పరివర్తన్ పేరుతో విలువల ఆధారిత, సానుకూల సమాజ నిర్మాణం కోసం పునరంకితం అవుతుందని వక్తలు తెలిపారు.

# జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

**– ఎంపి బస్తిపాటి నాగరాజు**


మాట్లాడుతున్న ఎంపి బస్తిపాటి నాగరాజు

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తున్నానని ఎంపి బస్తిపాటి నాగరాజు అన్నారు. బస్తిపాటి నాగరాజు కర్నూలు ఎంపిగా ప్రమాణ స్వీకారం చేసి ఏడాదైన సందర్భంగా జిల్లాలో పలుచోట్ల టిడిపి నాయకులు, అభిమానులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ ఆద్వర్యంలో మంగళవారం విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న ఎంపి నాగరాజు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ జిల్లాలో అన్ని వర్గాల ప్రజలు ఆదరించడంతోనే తాను ఎంపిగా గెలుపొందానని, తన విజయానికి కృషి చేసిన ప్రతిఒక్కరికి ఎప్పటికీ రుణ పడి ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, విద్యా సంస్థల అధినేత చంద్రశేఖర్, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు 'శక్తి' యాప్ ఓ రక్షణ కవచం


అవగాహన కల్పిస్తున్న శక్తి టీం బృందాలు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** అత్యవసర సమయాల్లో మహిళల భద్రతకు శక్తి యాప్ ఓ రక్షణ కవచంలా పనిచేస్తుందని పోలీసులు అన్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు శక్తి టీం బృందాలు పాఠశాలలు, కళాశాలల్లో శక్తి యాప్, శక్తి వాట్సప్‌లపై అవగాహ కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కావడంతో శక్తి యాప్ యొక్క ఆవశ్యకత, ప్రాధాన్యత శక్తి యాప్ ద్వారా అందించే సేవలను విద్యార్థినీలకు తెలియజేశారు. విద్యార్థినీలకు రక్షణ, భద్రత ఉంటుందని ప్రతిఒక్కరు శక్తి యాప్‌ను తమ చరవాణిలో నిక్షిప్తం చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని శక్తి బృందాలు తెలియజేశారు. ఆపదలో ఉన్న మహిళలకు అత్యవసర సహాయం అందించేందుకు శక్తి యాప్ ఓ ఆయుధంగా పనిచేస్తుందన్నారు. మహిళలు శక్తి వాట్సప్ నెంబర్ 7993485111కు కాల్ చేసినా, మెసేజ్ చేసినా సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సంకేతాలు వెళ్లిన వెంటనే శక్తి టీమ్స్ సత్వరమే స్పందించి ఆపదలో ఉన్న మహిళలను ఆదుకుంటాయని చెప్పారు. 24/7 వాట్సప్ నెంబర్ అందుబాటులో ఉంటుందన్నారు.

# ఎంపిడిఓకు సన్మానం

**కోసిగి మేజర్ న్యూస్ :**


ఎంపిడిఓను సన్మానిస్తున్న ఎంపిపి

కోసిగి మండల ఎంపిడిఓగా పనిచేసిన వెంకటేశ్వర్లుకు మంగళవారం సన్మానం చేపట్టారు. ఎంపిపి లవకుశ ఈరన్న ఆధ్వర్యంలో బదిలీ అయిన ఎంపిడిఓకు పూలవేసి, శాలువాకప్పి సన్మానించారు. కోసిగి ఎంపిడిఓగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లును రెండురోజుల క్రితం ప్యాపిలి మండలానికి బదిలీ చేయడం జరిగింది. దీనితో ఆయనకు సన్మానకార్యక్రమం చేపట్టారు. ఎంపిడిఓగా వెంకటేశ్వర్లు కోసిగి ప్రజలకు ఎంతో సేవచేశారన్నారు. ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ బసిరెడ్డి, నేలకోసిగి లక్ష్మన్న, లోకరెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

# సుజాత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** గోస్పాడు మండలం తేళ్ళపూరి గ్రామ సచివాలయ సెక్రటరీ బొప్ప సుజాత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి పరామర్శించారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి నంద్యాల జిల్లా గుంతనాల గ్రామానికి చెందిన బొప్ప నాగేంద్ర, పుల్లమ్మ దంపతులను వారి స్వగృహానికి వెళ్ళి పరామర్శించి భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేళ్ళపూరి గ్రామ సచివాలయం సెక్రటరీగా బొప్ప సుజాత పని చేస్తూ బ్రెయిన్ డెడ్ అయి మృతి చెందడం బాధాకరమని అన్నారు. ఆమె ఈ లోకాన్ని విడిచిపోతూ మరో ఎనిమిది మందికి తన అవయవాలను దానం చేసి జీవం పోసిందని అన్నారు. ఈ మేరకు గుంతనాల గ్రామంలో మృతురాలి తల్లిదండ్రులను మాజీ ఎమ్మెల్యే కలిసి పరామర్శించి వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నంద్యాల పట్టణం 21వ వార్డులో ఇటీవల మృతి చెందిన వైఎస్‌ఆర్‌పీసీ కార్యకర్త సుబ్బరాయుడు కుటుంబ సభ్యులను ఆయన కలిసి పరామర్శించారు. వీరి వెంట వైసీపీ నాయకులు రాజారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, వేణు, సుబ్బరాయుడు, అనీల్ అమృతరాజ్, తదితరులు ఉన్నారు.

# సొంత మండలంలో బదిలీకి అవకాశం కల్పించాలి



**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** గ్రామ సచివాలయాల్లో విధుల్లో ఉన్న తమకు సొంత మండలంలో పని చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించాలని కోరుతూ సచివాలయ ఉద్యోగులు మంగళవారం ఎంపీడీవో ఉమామహేశ్వరరావుకు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబుకు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం మానవా దృక్పదంతో తమ విన్నపాన్ని మన్నించాలని వారిని కోరారు. సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు నరసింహారెడ్డి, నాగకుమార్, సరస్వతి, హసీనా, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం లో భాగంగా టౌన్ మోడల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి ఆద్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే సామాజిక, చట్టపరమైన సమస్యల గురించి విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ఈఎస్ టాస్క్‌ఫోర్స్ సిఐ రాజేంద్ర ప్రసాద్‌లు మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల శారీరక, మానసిక, ఆర్థిక సమస్యలు కలుగుతాయన్నారు. వాటిని కలిగి ఉండడం లేదా సేవించడం వల్ల చట్టపరమైన సమస్యలు ఎదురవుతాయన్నారు. కావున విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదన్నారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నవీన్ బాబు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్దకడుబూరు మండలంలో గ్రామ సచివాలయాలు కుదింపు..?

**18 గ్రామ సచివాలయాలు 9 కి కుదింపు..**




**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** గత వైసిపి ప్రభుత్వం హయాంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్ధేశ్యంతో అప్పటి ప్రభుత్వం గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా పెద్దకడుబూరు మండలంలో 26 గ్రామాలకు గాను అందులో 20 గ్రామ పంచాయతీల్లో పెద్ద కడుబూరు గ్రామంలో 2 సచివాలయాలు. హెచ్ మురువణీ గ్రామంలో 2. చిన్న తుంభళం గ్రామంలో మరో 2 సచీవాలయాలు. కల్లుకుంటలో. 1,తారాపురం. 1.కంభళదిన్నే. 1. జాలవాడీ. 1 కంభళదహల్. 1. దొడ్డిమేకల గ్రామంలో. 1 .నాగలాపురం గ్రామంలో మరోకటి 1.గవిగట్టు. 1. పీకలబెట్టా. 1. మేకడోనాలో. 1. బసలదొడ్డి. లో. 1. నౌలకల్ గ్రామంలో. 1.మొత్తం 18 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేయడం జరిగింది. అయితే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రైయిజ్ లేషన్ కింద మండలంలోని 18 గ్రామ సచివాలయాలను కేవలం 9గ్రామ సచివాలయాలను కుదించినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. అలాగే 9 గ్రామ సచివాలయాలలో గవిగట్టు గ్రామ సచివాలయానికి పీకలబెట్టా. బాపులదొడ్డి గ్రామాలను కలపడం జరిగిందని. తారాపురం. రంగాపురం. చిన్నకడుబూరు. మేకడోనా గ్రామాలనుకలిపి నౌలకల్ గ్రామ సచివాలయం. అదే విధంగా బసలదోడ్డి గ్రామ సచీవాలయాన్ని కంభళదిన్నే గ్రామసచీవాలయానికి చేర్చినట్లు. దొడ్డిమేకల. గ్రామసచీవాలయాన్ని హనుమాపురం గ్రామ సచీవాలయంలోకి చేర్చినట్లు. కంభళదహల్ గ్రామ సచివాలయాన్ని జాలవాడీ గ్రామం సచివాల యానికి కలపడం జరిగిందని. ముచ్చిగేరి గ్రామాన్ని కల్లుకుంట గ్రామ సచీవాలయం లోకి చేర్చినట్లు. హులికన్వి. నాగలాపురం గ్రామాలను చిన్న తుంభళం గ్రామ సచీవాలయాన్ని కి. హెచ్. మురువణీ గ్రామంలో ఉన్న రెండు సచీవాలయాలను హెచ్. మురువణీ గ్రామ సచివాలయం చేర్చినట్లు. పెద్దకడుబూరు గ్రామంలోని ఉన్న రెండు సచివాలయాల ను కలిపి పెద్దకడుబూరు గ్రామ సచివాలయాంలోకి అటాచ్ మెంట్ చేసినట్లు అధికార వర్గాలు ద్వారా అందిన సమాచారం.

# పంట మార్పిడితో మంచి దిగుబడులు


రైతులతో మాట్లాడుతున్న ఏవో సుధాకర్‌రెడ్డి

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** రైతులు తమ పొలాల్లో పంట మార్పిడి చేపట్టడం వల్ల మంచి దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని రేవనూరు గ్రామంలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసే పంటలు, వాటిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా రైతులు ఒకే పంట మీద ఆధారపడటం వల్ల గత రెండు సంవత్సరాలుగా శనగ పంట సాగు చేయడం వల్ల దిగుబడి తగ్గి రైతులు నష్టపోతున్నారని అన్నారు. శనగ పంట వేసే ముందు జూన్, జులై నెలల్లో మినుము, పెసర, కొర్ర పంటలను సాగు చేయడం వల్ల అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని అన్నారు. మినుములో అంతర్ పంటగా కంది సాగు రైతులు చేయవచ్చని అన్నారు. భూమిలో సేంద్రీయ కర్బనం రోజు రోజుకు తగ్గిపోవడం జరుగుతుందని, ఈ సేంద్రీయ కర్బనం పెంచడానికి పచ్చి రొట్టె ఎరువులు వేసుకొని భూమిలో కలిసేందుకు దున్నుకోవాలని అన్నారు. దీని వలన భూమి ఆరోగ్యం కాపాడుకోవచ్చని అన్నారు. కంది, మినుము, జొన్న విత్తనాలు ప్రభుత్వ సబ్సిడీతో అందించడం జరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సూర్య

బుధవారం | 25 జూన్ 2025

### రామతారక మంత్రం సర్వ జీవులకు

# సద్గతులను ప్రసాదిస్తుంది

**- డాక్టర్ మల్లు వెంకటరెడ్డి**



మాట్లాడుతున్న డాక్టర్ మల్లు వెంకటరెడ్డి

**మిడుతూరు, మేజర్‌న్యూస్ :** రామతారక మంత్రం సర్వజీవులకు సకల పాపముల నుండి ఉపశమనంతో పాటు ఉత్తమ గతులను ప్రాప్తింప చేస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆద్వర్యంలో మంగళవారం మండల కేంద్రమైన మిడుతూరులోని శ్రీకృష్ణ మందిరం నందు నాలుగు రోజుల కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ వారు ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం డోన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ప్రముఖ ధార్మిక ప్రవచకులు డాక్టర్ తొగట సురేష్ బాబు మాట్లాడుతూ శ్రీమద్రామాయణములోని వివిధ పాత్రలు సమాజానికి ఎలా అన్వయం చేసుకోవాలో, అందులోని ఆదర్శాలను, లోక నీతిని దృష్టాంతాలతో వివరించారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారకులు చెంచు రామ్మోహన్ రావు, భజన మండలి అధ్యక్షులు బన్నూరు రామకృష్ణా రెడ్డి, దాలు చిట్టి బాబు, భజన నారాయణ, కె మదన మోహనాచారి, అర్చకులు అన్నమరాజు వెంకట్రామయ్య, మధు, సంపంగి వెంకటేశ్వర్లు, ఆర్ కిరణ్, జనార్ధన్ యాదవ్, జె వెంకటేశ్వర్లు, జయరాములు యాదవ్, శివ, నాగ సుబ్బుడు, భజన మండలి సభ్యులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో గోపాలకృష్ణుడు

## విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** 2025-26విద్యా సంవత్సరంలో పదవ తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంఈఓ ఓంకార్ యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మీదివేముల గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈఓ ఓంకార్ యాదవ్, వైస్ ఎంపిపి పద్మనాభరెడ్డిలు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఉపాధ్యాయుల హాజరు పట్టిక, విద్యార్థుల హాజరు బుక్కులను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం గురించి వివరాలను అడిగి తెలుసుకుని మెనూ ప్రకారం విద్యార్థులకు అందచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు యాదవ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



హాజరు బుక్కును పరిశీలిస్తున్న ఎంఈఓ

## ట్రిపుల్ ఐటీకి విద్యార్థి ఎంపిక

**ఓర్వకల్, మేజర్‌న్యూస్ :** పదవ తరగతి 2024-25విద్యా సంవత్సరంలో విద్యార్థులకు నిర్వహించిన ట్రిపుల్ ఐటి ఎంట్రన్స్ పరీక్షల్లో మండల పరిధిలోని లొద్దిపల్లె గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన జి ధర్మసాయి అనే విద్యార్థి ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు మండల విద్యా శాఖ అధికారి ఓంకార్ యాదవ్ మంగళవారం తెలిపారు. ప్రతిభ కనబరిచి సీటు సాధించిన విద్యార్థి ధర్మసాయిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.



# ఇంకెన్నాళ్ళు మాకీ త్రాగునీటి అవస్థలు..?

**- పార్టీలు మారుతున్నాయి కానీ..**

**- త్రాగునీటి సమస్య తీరడం లేదు..!**

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ :** వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయితీ పరిధిలో నివాసం ఉంటున్న గ్రామ ప్రజలకు దశాబ్దాలు గడిచిపోతున్నా, ఎన్నో పార్టీలు అధికారంలోకి వచ్చినా, మరెందరో పాలకులు మారుతున్నా త్రాగునీటి సమస్యకు మాత్రం శాశ్వత పరిష్కారం చూపించడంలో పూర్తిగా విఫలం చెందుతూనే ఉన్నారు. గత వైయస్ఆర్‌సిపి హయాంలో క్రిష్ణగిరి రిజర్వాయర్ నుండి రూ. 5కోట్ల నిధులతో వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయితీకి త్రాగునీటి సౌకర్యం కల్పించినా అధికారుల నిర్లక్ష్యం, ప్రస్తుత అధికార పార్టీ నేతల అలసత్వంతో ప్రజలకు త్రాగునీటి కష్టాలు తప్పడంలేదు. క్రిష్ణగిరి మండలం, తొగర్చేడు హంద్రీ నుండి గత తెలుగుదేశం ప్రభుత్వంలో వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయితీకి త్రాగునీటి వసతిని కల్పించిన అప్పటి డిప్యూటి సిఎం కేఈ.కృష్ణమూర్తి చొరవతో త్రాగునీరు ఏర్పాటు చేయడం జరిగింది. కాని అక్కడ విద్యుత్ సమస్య, మోటర్లు, పైపులు లీకేజి సమస్యలతో అరకొరగా వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయితీకి త్రాగునీరు రావడం జరుగుతుంది.



పంచాయితీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రాణితోట కాలనీ మహిళలు

వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయితీలోని 12, 13, 14, 15వ వార్డులలో త్రాగునీటి సమస్య ఉండడంతోపాటు మంగళవారం రాణితోటకు చెందిన మహిళలు గ్రామ పంచాయితీ కార్యాలయానికి వెళ్ళి మా కాలనీకి దాదాపు 15 రోజులకు పైగా త్రాగునీరు రావడంలేదని పంచాయితీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. త్రాగునీటి సమస్య వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయితీలోని అన్ని వార్డులలో ఉందని, కాని ఇటు అధికారులు, అటు పాలకులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని మహిళలు ఆరోపించారు.

## పచ్చదనం పెంపుకు ప్రణాళికలు సిద్ధం చేయండి

**- కమీషనర్ యస్ రవీంద్రబాబు**

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నగరపాలక కమీషనర్ యస్ రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగంలో అధికారులతో కమీషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే దాదాపు 4వేల మొక్కలను నాటడం జరిగిందని, అవకాశం ఉన్న ప్రతి ప్రాంతంలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. డివైడర్లు, రహదారుల ఇరువైపులా, పార్కులలో ఖాళీ స్థలాలను గుర్తించి ఆ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎస్ఈ శేషసాయి, ఎంఈ లీలా ప్రసాద్, హార్టికల్చర్ ఏడి విజయలక్ష్మి, డిఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమీషనర్ రవీంద్రబాబు

## సుంకేసుల గ్రామంలో పొలం పిలుస్తోంది



**అవుకుమేజర్,న్యూస్:** అవుకు మండలం సుంకేసుల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి కలిమున్నిసా ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్ర మంలో ఆమె మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో సాగు పద్దతుల గురించి పురుగు తెగుళ్ల యాజమాన్యం గురించి రైతులకు తెలిపారు. కలుపు యాజమాన్యం పంట విత్తిన 48 గంటల్లోపు అట్రాజిన్ కలుపు మందు 800 గ్రాములు ఎకరానికి తేలిక నేలలో 1200 గ్రాములు బరువు నేలలో 200 లీటర లనీటిలో కలిపి పిచికారి చేసుకున్నట్లయితే వెడల్పాటి కొన్ని గడ్డి ఆతి కలుపు మొక్కలను అదుపు చేయవచ్చు. అపరాలను అంతర పంటగా వేసుకున్నట్లయితే పెండి మిథాలిన్ మందును ఎకరానికి ఒక లీటరు నీటికి రెండు రోజుల్లోపు పిచికారి చేసుకోవాలి. వెడల్పాటి గడ్డిజాతి మొక్కల నివారణకు 15 రోజులప్పుడు ఎకరానికి టెంబోట్రయోన్ 115 మి.లీ + అట్రాజిన్ 400 గ్రాములు కలిపి పిచాకారి చేసుకోవాలి. 30-35 రోజుల లోపల అంతర కృషి చేసుకొని బోదె నాగలి నడిపినట్లయితే మొక్కలు పడిపోకుండా ఉంటాయి. పంట లేత దశలో అధిక నీరు హానికరం ఉదయం వేళల్లో ఆకులు చుట్టుకున్నట్లు కనిపిస్తే నీటి ఆవశ్యకత ఉన్నట్లు గమనించి వెంటనే నీరు కట్టాలి. బోదెలు, కాలువల పద్దతి అవలంభిస్తే నీటిని ఆదా చేయొచ్చు. కలుపును సమర్ధవంతంగా నివారించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారినితోపాటు పశువైద్యా ,దికారి భారతీదేవి, వి.హెచ్ఎ పఠాన్ నాయక్, వి.ఏ.ఏ కళ్యాణి, గ్రామ నాయకులు చంద్ర శేఖర్ రెడ్డి , ప్రతాప్ రెడి , మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

### ఎస్సీ కాలనీలో హైఓల్టేజీతో..

# కాలనీ వాసుల ఇక్కట్లు..!

**- భయాందోళనలో కాలనీ ప్రజలు**

**- స్పందించని విద్యుత్ శాఖ అధికారి**

**- కాలనీ వైపు కన్నెత్తి చూడని విద్యుత్ శాఖ అధికారులు**

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** ఎస్సీ కాలనీ 14వ వార్డు నందు హైహోల్టేజీ కరెంట్ రావడంతో టి.విలు, ప్యాన్లు, బల్బులు కాలిపోయి, పేలిపోయి భారీగా నష్టం వాటిల్లిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో హై వోల్టేజీ కరెంట్ వచ్చిందని విద్యుత్ శాఖ ఏఈకు, సిబ్బందికి పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదని వాపోయారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది మాత్రం కరెంట్ చార్జీలు సమయానికి చెల్లించకపోతే కరెంట్ కట్ చేస్తామని చెదిరింపులకు పాల్పడుతూ, సకాలంలో కరెంట్ బిల్లులు చెల్లించుకంటున్నా రేతప్ప కాలనీలో ఏమైనా సమస్యలు జరిగితే మాత్రం స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నారని కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. కాలనీలో లోఓల్టేజీ, హైఓల్టేజీ కరెంట్ సమస్యలు వస్తున్నాయని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్‌కు అనేకసార్లు విన్నవించుకున్న ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వహించడంతో మంగళవారం మధ్యాహ్నంనుండి ఎస్సీ కాలనీ మొత్తం హైవోల్టేజీ కరెంట్ రావడంతో సమస్య తీవ్రంగా అయి అందరి ఇండ్లలో టి.విలు, ఫ్యాన్లు, బల్బులు కాలిపోయి పేలిపోవడంతో ఒక్కసారిగా శబ్దాలు రావడంతో భయాందోళనకు గురై ఇళ్లలో నుంచి పరుగులు పెట్టినట్లు కాలనీవాసులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్సీ కాలనీలో లోఓల్టేజీ, హైఓల్టేజీ కరెంట్ సమస్యను పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యుత్ శాఖ అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరారు.

### హై ఓల్టేజీతో రెండు ఫ్యాన్లు కాలిపోయాయి...

### కాలనీవాసి జయరాముడు

కాలనీలోహైల్టోజీ పవర్ కరెంట్ వచ్చి మా ఇంట్లో రెండు ఫ్యాన్లు కాలిపోయి పనిచేయకుండా ఉన్నాయని బల్బులు పేలిపోయాయని ఆ కాలనీ వాసి జయరాముడు తెలిపారు. రెండు ఫ్యాన్లు, బల్బుల ఖర్చు దాదాపుగా రూ.1500వరకు వస్తుందన్నారు. కాలనీ మొత్తం హైఓల్టేజీ కరెంట్ రావడంతో అందరి ఇండ్లలో నష్టం జరిగిందని ఆవేదన చెందారు. కేవలం విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు.







# వైభవంగా విజయీంద్రతీర్థుల రథోత్సవం

- ముగిసిన ఆరాధానోత్సవాలు
- హజరైన టీడీపీ నాయకులు,భక్తులు



హజరైన టీడీపీ నాయకులు

**హొళగుంద,మేజర్‌న్యూస్ :** హొళగుందలో మంగళవారం విజయీంద్రతీర్థుల రథోత్సవం కన్నుల పండువగా వైభవంగా జరిగింది.స్థానిక కోటాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 20 తేదిన ప్రారంభమైన మంత్రాలయం శ్రీ గురు రాఘవేంద్రస్వామి గురువు అయిన శ్రీ విజయీంద్రతీర్థుల ఆరాధానోత్సవాలు ఐదు రోజుల పాటు అత్యంత వైభవంగా ముగిశాయి.ముగింపు రోజున స్వామి వారి బృందావనానికి వేద బ్రహ్మణీయులు ఉదయం నిర్మాల్య విసర్జన,సుప్రభాత సేవా,పంచామృతం,తుళసి అర్చన,పురందరదాసర భజన కార్యక్రమం, విజయీంద్రతీర్థుల,ఆంజనేయస్వామి వార్లకు ప్రత్యేక అలంకరణ,దేవాలయం నుండి బస్టాండ్ వరకు స్వామి వారి రథోత్సవం కార్యక్రమాలు విశేషంగా జరిగాయి.రథోత్సవంలో మహిళల కోటాలు,గజ్జహళ్లి గ్రామానికి చెందిన భజన,మేళాతాలతో ఆంజనేయస్వామి బొమ్మ వేషాధారణ,యువకులు నృత్యాలు కార్కమాలు ఆకట్టున్నాయి.ఈ కార్యక్రమానికి టీడీపీ యువ నాయకులు వ్యాపారవేత్తలు రాజాగౌడ,ఎన్‌సి శివప్రకాశ్,మండల యూత్ నాయకులు,వివిధ గ్రామాల నుండి కర్ణాటక ప్రాంతాల నుండి వచ్చిన బ్రహ్మణీయ భక్తులు,ఎస్ఐ దిలిఫ్‌కుమార్ హజరైయ్యారు.

# శ్రీ రాఘవేంద్రస్వామి మఠం హుండీ ఆదాయం లెక్కింపు

**– నగదు రూ.5,13,04,958లు, బంగారం 837 గ్రాములు, వెండి కేజీ**

**మంత్రాలయం రూరల్,మేజర్ న్యూస్ :** మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠం హుండీ ఆదాయం లెక్కింపు చేసినట్లు శ్రీ మఠం మేనేజర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం హుండీ ఆదాయాన్ని గట్టి బందోబస్తు మధ్య లెక్కించినట్లు తెలిపారు. ఈ హుండీని లెక్కించగా, నగదు రూ.5,13,04,958లు, బంగారం 837గ్రాములు, కేజీ వెండి వచ్చిందన్నారు. 35రోజులకుగాను ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఈ నగదు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులో జమ చేసినట్లు తెలిపారు.



# శ్రీశైలంలో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు



**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలంలో బాంబు స్క్వాడ్,డాగ్ స్క్వాడ్ బృందాలతో మంగళవారం ముమ్మరంగా ప్రత్యేక తనిఖీలు చేస్తున్నారు.ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయాలని నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలు.. ఆత్మకూరు డి.ఎస్.పి రామాంజీ నాయక్ సూచనల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు.బస్టాండ్ పరిసర ప్రాంతాలు, సరిహద్దులు,వసతి గృహాలు,గుడి పరిసర ప్రాంతాలు, చెక్ పోస్టులలో తనిఖీలు చేశారు.పుణ్యక్షేత్రమైన శ్రీశైలం దేవస్థానం పరిసర ప్రాంతాల్లో,ఏవైనా అనుమానాస్పద వస్తువులు ఉన్నాయేమోనని ముందస్తు జాగ్రత్తగా ఈ తనిఖీలు చేపట్టారు.అనుమానాస్పద వ్యక్తులు గాని, అనుమానాస్పద వస్తువులు గాని తారసపడితే వెంటనే 100,112,సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.



# చెత్తాచెదారం.. చిత్తశుద్ధి లేని అధికారులు..!!

- పెద్దకడుబూరులో లోపించిన పారిశుద్ధ్యం
- డ్రైనేజీలో పేరుకొనిపోయిన చెత్త చెదారం ప్రధాన రహదారి పైనే చెత్త..
- పందుల స్వైర్య విహారం
- దుర్వాసన వెదజల్లుతోన్న కాలువలు.. ప్రజల ఆరోగ్యం పట్టించుకోరా..!
- స్పందించని ఇవోఆర్డీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి..

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్:** పెద్దకడు బూరు మండల కేంద్రంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త చెదారం వేయడం పందులు స్వైర విహారం చేయడం వలన గ్రామం లో పూర్తిగా పారిశుద్ధ్యం లోపించి నప్పటికి సంబంధిత ఇవోఆర్డీ. గ్రామ సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి గాని ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శ లు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ము ఖ్యంగా గ్రామంలోని కురవ వీధి, ఎస్సీ కాలనీలలో ప్రధాన రహదారి వెంటి ఎం పిడిఓ కార్యాలయానికి వెళ్ళే దారి పొడ వునా ఎక్కడ పడితే అక్కడ హెూటళ్ల యాజమానులు హెూటళ్ల తినివేసిన చిత్తుకాగితాలు,ప్లాస్టిక్ కవర్లు గ్లాసులు, కర్నాటక మద్యం ప్యాకెట్లు. మద్యంసీసా లు రోడ్డు ప్రక్కన పడివేయడం వలన రోడ్డుకు ఇరువైపులా ఎటు చూసిన పారిశుద్ధ్యం కొట్టోచ్చినట్లు దర్శనమిస్తుం ది.దుర్వాసన వెదజల్లుతున్న ఆ దారుల వెంట వెళ్లుతున్న ఉద్యోగులు. విద్యార్థు లు. ఇటు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు అంటు న్నారు. అలాగే డ్రైనేజీ లో కూడా కూల్ డ్రింక్ బాటిల్. ప్లాస్టిక్ కవర్లు. గ్లాసులు. పూడిక పేరుకొని పోవడం వల్ల మురుగు నీరంతా రోడ్లపైకిచేరి బురద మయంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. అదే విధంగా వర్షాలు కురిస్తే కురవ వీధిలో వర్షపునీరు రోడ్లపైకి చేరి గుంతలు మయం అవుతున్న ఏ ఒక్క ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా పట్టించుకోకపోవడం విచారకరం అని పలువురు కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ప్రతి నెలలో జరిగే స్వచ్ఛాంధ్రా.. స్వర్ణాంధ్రా పేరుకే మాత్రం కాని ఎక్కడ పారిశుధ్యం పను లు జరగడం లేదని పారిశుద్ధ్యం లోపిం చడం వల్ల గ్రామంలో ప్రజలు అనారో గ్యాల బారినపడే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం తాండవం ఆడుతున్న అటు ఇవోఆర్డీ కాని గ్రామ సర్పంచ్. పంచాయతీ కార్యదర్శి కాని ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు గ్రామంలో సర్వత్రా వ్యక్తమవు తున్నాయి. ఇప్పటికైనా గ్రామ పంచా యతీ అధికారులు ప్రజాప్రతినిధులు



జోక్యం చేసుకుని మురుగు కాలువలను శుభ్రం పరిచి రోడ్డు వెంబడి చెత్త చెదారాన్ని తొలగించెటట్లు చూడాలని పలువురు గ్రామస్తులు అధికారులను ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.



# మా కాలనీ అంటే ఎందుకంత చులకన

**– కనీస వసతులకు నోచుకోలేకపోతున్నామని కాలనీవాసులు ఆవేదన**

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** కల్లూరు మండలంలోని ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఇళ్ల స్థలాలు కేటాయించిందని అయితే నేటి వరకు ప్రభుత్వాలు, అధికారులు కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు చేకూర్చలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కాలనీవాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వీధిలైట్లు, నీటి మోటర్లు ఏర్పాటు చేశారని కానీ రోడ్లు, డ్రైనేజీలు వేయలేదన్నారు. దీంతో ఇక్కడ వర్షం పడిందంటే అంతా బురదమయం అవుతుందని వాపోయారు. విషపురుగులు సంచరిస్తున్నాయని వాటికి



భయపడి కాలనీవాసులు పిల్లల్ని, వృద్ధులను బయటకు పంపలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. తాగునీటి కోసం కనీసం 3కి.మీల వెళ్లవలసి వస్తుందని ఆరోపించారు. వర్షం వచ్చినప్పుడు వ్యాపారులు, ఉద్యోగులు, ప్రజలు మోటార్ సైకిల్, వాహనాలు నడిపేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తాము ఎన్నిసార్లు కలెక్టర్ కార్యాలయం, మున్సిపల్ కమీషనర్‌కు విన్నవించినా ఫలితం శూన్యమన్నారు. అధికారులు రోడ్లు వస్తాయి, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెబుతూ కాలయాపన చేస్తున్నారు తప్ప ఇంతవరకు రోడ్లు, డ్రైనేజీలు వేయలేదని అసహనం వ్యక్తం చేశారు. ఒకసారి ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలు వచ్చి చూస్తే మాబాధ అర్థం అవుతుందని మండిపడ్డారు. ఇప్పటికైనా తమ కాలనీలో రోడ్లు, మౌలిక వసతులు కల్పించాలని వారు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో అన్వర్ బాష, నాగరాజు, రాము, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

సూర్య www.suryaa.com



# రైతులు వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చు

**వ్యవసాయ అధికారి సురేష్ యాదవ్**



**తుగ్గలి,మేజర్ న్యూస్ :** ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వ్యవసాయ పద్ధతులు సూచనలు పాటిస్తే అధిక దిగబడును పొందవచ్చునని మండల వ్యవసాయాధికారి సురేష్ యాదవ్ అన్నారు. మంగళవారం తుగ్గలి మండలం ముక్కెళ్ళ పొలం నందు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంకు ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ గౌరవ సలహాదారు రామచంద్ర , నాయకులు, గ్రామ రైతులు మరియు మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సురేష్ యాదవ్ మాట్లాడుతూ రాయితీపై ప్రభుత్వం ఇస్తున్న వేరుశనగ విత్తనాల గూర్చి తెలియజేశారు. అలాగే అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా గూర్చి మరియు అన్నదాత సుఖీభవ పై ఉన్న రైతుల సందేహాలను వివరించారు. అలాగే గ్రామంలో కౌలుకు తీసుకుంటున్న రైతులను కౌలు కార్డు తీసుకోవాల్సిందిగా అలాగే కౌలు కార్డు యొక్క ఉపయోగాలను తెలియజేశారు. అనంతరంఆయన రైతులతో కలిసిముక్కెళ్ల గ్రామంలోని పొలాలలో ఉన్న పంటలను పరిశీలించి రైతులకు ఎరువులు మరియు సస్య సంరక్షణ చర్యలు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏ ఈ ఓ మల్లేష్ రోహితు మరియు గ్రామ వ్యవసాయ సహాయకులు తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల అభివృద్ధికి రైతులు సహకరించాలి



మాట్లాడుతున్న జిల్లా సీఈవో రామాంజినేయులు

**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** జిల్లాలోని సహకార సంఘాల అభివృద్ధికి ఆయా గ్రామాలలోని రైతులు సహకరించాలని జిల్లా సీఈవో రామాంజినేయలు, డీసీవో వెంకటకృష్ణ నాబార్డ్ డీడీఎం సుబ్బారెడ్డి, హబ్ కాబ్ డీఎం మెహరన్ సుల్తానా అన్నారు. బుధవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని పీఏసీ కార్యాలయం ఆవరణ నందు గోనెగండ్ల, హెచ్ కైరవాడి గ్రామాల సీఏసీ పరిధిలోని రైత లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహకారసంఘంఅధికారులు మాట్లాడుతూ సహకార సంఘాలలో రైతులు రుణాలు చెల్లించేటప్పుడు వారికి ఆన్లైన్ రసీదులు, ఆన్లైన్ పేమెంట్ జరుగుతుందన్నారు. గతంలో రైతులు రుణాల కోసం అకౌంట్ బుక్స్ తీసుకోవడానికి కోడుమూరు డీడీసీ బ్యాంక్ వచ్చి చేసుకొనేవారు అయితే ఇప్పుడు అలాంటి అవసరం లేదన్నారు. రైతులు తమ సహకార సంఘాలలోనే రుణాల అకౌంట్ చేసుకోవడానికి వెలుబాటు కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే రైతులకు క్రాప్ లోన్లు, మార్టిగేజ్ లోన్లను కూడా ఇస్తున్నామని తెలిపారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలని దీంతో రైతుల సివిల్ స్కోర్ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ కైరవాడి సీఈవో గోపాల్ రెడ్డి, గోనెగండ్ల బ్రాంచ్ పీఏసీఎస్ మేనేజర్ అయ్యాం సీఈవో చంద్రశేఖర్, ఖాసీం సాహెబ్, సిబ్బంది మునిస్వామి, లక్ష్మన్న, ప్రకాష్రెడ్డి, దినేష్రెడ్డి, హరి, రైతులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి- హౌసింగ్ పీడీ



గృహనిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ

**చాగలమర్రి , మేజర్ న్యూస్ :** పిఎంఏవై ఎన్టిఆర్ నగర్ లేఅవుట్‌లలో గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా హౌసింగ్ పీడీ హరగోపాల్ తెలిపారు. చాగలమర్రి పట్టణంలోని లోని నారాయణపల్లె రస్తాలో గల ఎన్‌టిఆర్ నగర్ లే అవుట్‌లలో గృహనిర్మాణాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పిఎంఏవై అర్బన్ క్రింద 46,445 గృహాలు మంజూరు కాగా 27,760 గృహాలు పూర్తయ్యాయని మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయన్నారు. అలాగే గ్రామీణం క్రింద 12,689 గృహాలు మంజూరు కాగా 3298 గృహాలు పూర్తయ్యాయన్నారు. ఈ గృహాలన్ని మార్చి 2026 చివరికల్లా పూర్తి చేయాలన్నారు. పిఎం జన్‌మన్ క్రింద చెంచులకు 562 గృహాలు మంజూరు అయ్యాయని వాటిలో 208 పూర్తి అయ్యాయన్నారు. ఈ గృహాలను సెప్టెంబరు చివరికల్లా పూర్తి చేయాలన్నాలు. గృహ నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఎస్సీ,బీసీ లకు రూ 50 వేలు,ఎస్టీలకు రూ75 వేలు,చెంచులకు లక్ష రూపాయలు అదనంగా ఆర్థిక సహాయం ప్రభుత్వంమంజూరు చేసిందన్నారు. కావున లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ విజయ్‌బాబు,ఏఈ నరసింహారావు, వర్క్ఇన్‌స్పెక్టర్ ఓబులేసులు పాల్గొన్నారు.

# జిల్లాలో విస్తృతంగా విజుబుల్ పోలీసింగ్

**- ఏపీకే ఫైల్స్‌పై అవగాహన**



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లాలో విస్తృత్తంగా విజుబుల్ పోలిసింగ్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ క్రైం, మోసపూరిత ఏపీకే ఫైల్స్‌ల గురించి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు పోలీసులు నిర్వహించారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని విద్యార్థినీ, విద్యార్థులకు, యువతకు, ఆటో, లారీ డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడపరాదని అన్నారు. వాహనాలు నడిపే సమయంలో మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు దారి తీస్తుందని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, దీనిపై తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియమాలను బలోపేతం చేయడం, వివిధ ప్రధాన రహదారులపై స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్ లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రత్యేకంగా ప్రధాన కూడళ్ళల్లో, రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మద్య కాలంలో వాట్సాప్ యాప్‌లలో సైబర్ నేరగాళ్లు మోసపూరితమైన ఫైళ్ళను పంపుతున్నారని, అలాంటి వాటిని క్లిక్ చేయరాదని, సైబర్ క్రైం నేరాలు జరిగినప్పుడు సైబర్ క్రైం పోర్టర్ ఎన్‌సీఆర్‌సీలో గానీ, 1930కి గాని ఫిర్యాదు చేయాలని, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదు చేయాలని అన్నారు.

# మండల విద్యాధికారులను సస్పెండ్ చేయాలి- ఏఐఎస్ఎఫ్

**పత్తికొండ మేజర్ న్యూస్ :** కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతున్న మండల విద్యాధికారులను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి శివ డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సెయింట్ జోసెఫ్ స్కూలు ఎదురుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెయింట్ జోసెఫ్ స్కూలు యజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ, విద్యార్థుల తల్లిదండ్రులపై పెనుభారం మోపుతున్నారని ఆరోపించారు. విద్యార్థులు ఫస్ట్ టర్మ్ ఫీజులు చెల్లిస్తేనే పాఠ్యపుస్తకాలు కొనాలనే నిబంధనలు పెట్టడం సరైంది కాదన్నారు. అధిక ఫీజుల దోపిడిపై పాఠశాలలో జరుగుతున్న అక్రమాలపై మండల విద్యాధికారులకు పలుమార్లు విన్నవించినా సమస్య పరిష్కారానికి కృషి చేయకుండా కాలయాపన చేసిన ఎంఈఓ తిమ్మారెడ్డి, ఎంఈఓ-2 గాజుల రమేష్‌లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వారు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రవి, చరణ్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి అల్తాఫ్, పట్టణ ఉపాధ్యక్షుడు నజీర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు కేశవ, దశరథ, ఇర్ఫాన్, గణేష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియను పటిష్టం చేయడంలో పార్టీల అభిప్రాయాలు కీలకం



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్వో

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో ఎన్నికల ప్రక్రియను పటిష్టం చేయడంలో రాజకీయ పార్టీల అభిప్రాయాలు, సూచనలు కీలకమని జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా డీఆర్వో చాంబర్‌లో గుర్తింపు రాజకీయ పార్టీ ప్రతినిధులతో డీఆర్వో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహాయ సహకారాలు అందజేయాలన్నారు. ఓటర్ల జాబితాలోని మృతులు, మార్పులు, చేర్పులను బూతు స్థాయి ఏజంట్లతో పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఈఆర్వో, ఏఆర్వోలకు తెలుపాలన్నారు. అనంతరం సమావేశంలో పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో అమలు చేసిన హోం ఓటింగ్ శాతాన్ని అమలయ్యేలా చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే పోస్టల్ బ్యాలెట్‌లో గెజిటెడ్ అధికారి సంతకం, జిల్లాలో గిరిజనులు, చెంచు జనాబా ఎక్కువ ప్రాంతాల్లో వారికి ఓటింగ్‌పై చైతన్యం కల్పించాలన్నారు. సమావేశంలో ఎన్నిక విభాగ సూపరింటెండెంట్ జయప్రసాద్‌చ, ఏఓ సుధాకర్, బీఎస్పీ తరపున సుధాకర్, కాంగ్రె స్ పార్టీ తరపున రియాజ్, టీడీపీ తరపున శివరాంరెడ్డి, వైసీపీ తరపున సాయిరాంరెడ్డిలు పాల్గొన్నారు.

# సచివాలయ ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి..



**తుగ్గలి,మేజర్ న్యూస్ :** రేషనలైజేషన్ మరియు బదిలీలు గూర్చి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల పదోన్నతులు, జాబ్ చార్టు అమలు గురించిన విన్నపములు బదిలీలు ప్రక్రియ సినీయారిటీ ప్రకారం పారదర్శకముగా నిర్వహించాలని సచివాలయ ఉద్యోగులు మంగళవారం ఎంపీడీవో తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అం దజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల మైన మేము అన్ని శాఖల తరపున సవినయంగా విన్నవించుకొను విన్నపములను వారికి తెలియజేశారు. గ్రామ వార్డు సచివాలయ అన్ని శాఖల ఉద్యోగులకు ప్రమోషన్ ఛానెల్ కల్పించి, స్పష్టమైన జాబ్ చార్ట్ ఇచ్చి సర్వీస్ రూల్స్ అమలు చేసిన తర్వాత మాత్రమే ట్రాన్స్ఫర్ పక్రియ జరపాలి, ట్రాన్స్ఫర్ ప్రక్రియ సీనియారిటీ, మెరిట్ జాబితాలు విడుదల చేసి సజావుగా పారదర్శకంగా జరిగే లాగున, ఏ ఒక్క అభ్యర్థికి నష్టం జరుగకుండా చూడమని అభ్యర్థిస్తున్నామన్నారు. సచివాలయ ఉద్యోగులకి రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్ మరియు పెండింగ్ అరియర్ వెంటనే క్లియర్ చేయాలి. నోషనల్ ఇంక్రిమెంట్స్ కొరకు తక్షణమే ఒక కమిటీని ఏర్పాటు చేయవసిందిగా కోరుచున్నామన్నారు. రేషనలైజేషన్ ప్రక్రి య ద్వారా ఏర్పడిన మిగులు సిబ్బందిని ప్రభుత్వం ఏ విధంగా వినియోగించుకుంటుంది అనే విషయం పై స్పష్టత ఇవ్వాలన్నారు. అలాగే బదిలీ ప్రక్రియలో ఉద్యోగులు సొంత మండలాల్లో పని చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఈ విన్నపములను నెరవే ర్చుకుందుకు మీ వంతు సహకారం అందిస్తారని వారు అధికారులను కోరారు. వివిధ గ్రామాలకు చెందిన సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# రీ సర్వే సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోండి

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** భూ రీ సర్వే జరిగిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎం నుంచి సింగిల్ ఎల్‌పీఎంకు మారడానికి వారి పరిధిలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు తెలిపారు. రీ సర్వే జరిగిన తరువాత ఆ సర్వే నంబర్‌లో ఉన్న రైతులు ఇద్దరు, ముగ్గురి విస్తీర్ణాలు జాయింట్ ఎల్‌పీఎంగా ఆన్‌లైన్‌లో చూపిస్తున్నాయని అన్నారు. ఈ కారణంగా రైతులు ప్రభుత్వ పథకాలకు అనర్హులవుతున్నారని అన్నారు. రైతుల విన్నపం మేరకు ప్రభుత్వం స్పందించి ఈ సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. కాబట్టి ఇలాంటి సమస్యలు ఉన్న రైతులు సచివాలయాలలో చలానా చెల్లించి వారి ఫిర్యాదులను నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ ఫిర్యాదులను పరిశీలించి సింగిల్ ఎల్‌పీఎంకు మార్చడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు.

# ఆర్‌పి రమాదేవి అవినీతిపై విచారణ చేపట్టండి

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** పొదుపు సంఘాలలో అక్రమాలకు పాల్పడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల మహిళల సొమ్మును స్వాహా చేస్తున్న ఆర్‌పి రమాదేవి అవినీతిపై విచారణ చేపట్టాలని బిఎస్ఎఫ్ నాయకులు విజయభాస్కర్ డిమాండ్ చేశారు. ఆ మేరకు మంగళవారం పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట పొదుపు మహిళలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ పట్టణంలోని మయూరి పొదుపు సంఘానికి సంబందించిన రెండు వాయిదాల డబ్బు రూ. 1.40లక్షలను గత సంవత్సరం కిందట బ్యాంక్‌కు చెల్లించకుండా సొంత ఖర్చులకు వాడుకుందని, మహిళలు ప్రశ్నించడంతో తిరిగి ఆ సొమ్మును బ్యాంకుల్లో జమ చేసిందని తెలిపారు. ఇదివరకే మెప్మా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఆర్‌పి రమాదేవిపై చర్యలు ఏమి తీసుకోలేదని, అందుకే తాము ఆందోళన బాట పట్టామన్నారు. మయూరి గ్రూపుకు సంబందించి గత లోన్‌లో కూడా ఈ తరహాలోనే రెండు వాయిదాల సొమ్మును ఆర్‌పి రమాదేవి కాజేసిందని ఆరోపించారు. ఏళ్ళ తరబడి ఆర్‌పిగా కొనసాగుతున్న రమాదేవిపై నిత్యం ఈ తరహ వివాదాలు చోటుచేసుకుంటున్నప్పటికీ ఆమెపై మెప్మా అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో మర్మమేమిటో వారికే తెలియాలన్నారు. అవినీతి అక్రమాలను ప్రశ్నించిన మయూరి పొదుపు సంఘాన్ని డిఫాల్ట్ గ్రూపుగా చేస్తామంటూ బెదిరించడం అన్యాయమన్నారు. నిబంధనలకు విరుద్దంగా పొదపు లీడర్‌గా కొనసాగుతున్న సచివాలయ ఉద్యోగిని లలితను వెంటనే గ్రూపు లీడర్‌గా తొలగించాలని వారు కోరారు. ఇప్పటికైనా అధికారులు ఆర్‌పి రమాదేవి అక్రమాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో జిల్లా అధికారులకు సైతం ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. అనంతరం మెప్మా అధికారులకు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శివన్న, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

## యువత డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకోరాదు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ విజయ్ కుమార్

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :**యువత డ్రగ్స్ బారిన పడితమజీవితాలను నాశనం చేసుకోవద్దని ఆళ్లగడ్డఎక్సైజ్‌సీఐవిజయ్‌కుమార్ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని వైపిపిఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళ వారం నిషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును డ్రగ్స్ బారినపడి నాశనం చేసుకోవద్దని అన్నారు. ఈ సమావేశంలో ఎస్.ఐ సరస్వతి, జూనియర్ కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన వైద్యాధికారి హరితకు సన్మానం



**తుగ్గలి,మేజర్ న్యూస్ :** తుగ్గలి మండలం పరిధిలోని పగిడిరాయి ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలిగా పనిచేస్తున్న హారిక ఇటీవలె బదిలీపై వెళ్లడంతో మంగళవారము వైద్య సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వైద్యాధికారిహరిత మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు పదవి విరమణలో సర్వసాధారణమని, అక్కడ ఉన్నంతకాలం ప్రజల మన్ననలను పొందాలన్నారు. ఇంతవరకు నన్ను ఆదరించిన వైద్య సిబ్బందికి ప్రజలకు ఆమె అభినందనలు తెలిపారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మెయిన్ స్కూల్ ఉపాధ్యాయులు

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామంలో మెయిన్ స్కూల్ లో ఉధ్యాయులకు ఘన సన్మానం లభించింది. ఉపాధ్యాయుల సాధారణ బదిలిలో భాగంగా గ్రామంలోని మెయిన్ స్కూల్ లో విధులు నిర్వహిస్తున్న జి.జాన్సీరాణి పెద్ద పాడుకు బదిలీ కావడం, అదేవిధంగా ఇదే స్కూల్ నుండి ఇదే గ్రామంలోని రెగ్యులర్ పాఠశాలకు ఎచ్ఎంగా పదోన్నతి పై వెళున్న వరలక్ష్మమ్మలను స్థానిక మెయిన్ స్కూల్ సిబ్బంది మంగళవారం వీరిని శాలువాతో సత్కారించి సన్మానించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న వీరు మట్లాడుతూ ఈ పాఠశాల ఎన్నోఅనుభూతులు,జ్ఞాపకాలనుమిగిల్చిందనిఉపాధ్యాయులకు ఒక్కస్థానం అనేది ఉండదని ఎక్కడికెళ్లిన విద్యార్థులభవిష్యత్తుకు ఉపయోగ పడటమే ఉపాధ్యాయుల లక్ష్యమన్నారు. బదిలీపై వెళ్తున్న మమ్ములను గౌరవించిందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలియజెస్తున్నామని వారు తెలిపారు.

## ప్రతి ఉద్యోగికి బదిలీ సర్వసాధారణం



సన్మానం చేస్తున్న దృశ్యం

**చాగలమర్రి ,మేజర్ న్యూస్ :** ప్రతి ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమని ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు వరప్రసాద్ పేర్కొన్నారు. చాగలమర్రి పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో చాగలమర్రి,ఉయ్యాలవాడ మండలాలలో బదిలీపై వెలుతు న్న,వచ్చిన వారికి సన్మాన సభ ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీ పై వెలుతున్న వారు చేసిన సేవలు అమోఘమన్నారు. బదిలీపై ఉయ్యాలవాడ మం డలం అల్లూరుకు వెలుతున్న ముత్యాలపాడు పశువైద్యాధికారి సాయిబాబాను,చాగలమర్రి పశువైద్యాశాలలో బదిలిపై వెలుతున్న ఎల్ఎస్ఏ కోటయ్యలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు పుల్లయ్య,దీపా,రవీంద్ర, నాగశైలజ,పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పత్తిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి-ఏఓ. మల్లేష్ కుమార్




పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించిన ఏఓ.మల్లేష్ కుమార్

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలంలో రైతులకు పొలం పిలిస్తుంది కార్యక్రమం ద్వారా యాజమాన్య పద్దతులపై అవగాహనా కల్పించారు. అందులో భాగంగా మంగళ వారం కంబదహాల్,సి.బెళగల్ రైతుసేవ కేంద్రాలలో మండల వ్యవసాయ అధికారి జి మల్లేష్ కుమార్ ఆధ్వర్యంలో పొలంపిలుస్తుంది అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఏఓ. మలేష్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్నటువంటి పంటలగురించి అవగాహన కల్పించారు. అదే విధంగా మండలంలోని అధిక విస్తీర్ణంలో ప్రత్తి సాగవుతున్నందువల్ల, రైతు సోదరులు ముందుగా పత్తి పంటలో సరైన యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో వ్యవ సాయ సిబ్బందితో కలిసి పత్తి పంటలను పరిశీలించడం జరిగినది. ఈ వర్షభావ పరిస్థితుల లో బెట్టా రాకుండా చర్యలు తీసుకోవాలని అలాగె రసం పీల్చే పురుగు నివారణకు ఒక లీటర్ నీటిలో 2 గ్రాముల ఎసిఫేట్ మరియు ఐదు ఎం ఎల్ వేప నూనె కలిపి పిచికారి చేసుకోవలని సూచించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది మరియు రైతు సోదరులు పాల్గొన్నారు.

## పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవు

**-కార్మిక సహాయ అధికారిణి సారా మార్గరేట్**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** పిల్లలను పనిలో పెట్టుకొని బాలకార్మికులు మార్చాలని చూస్తే సహించేది లేదని, బాలకార్మిక చట్టప్రకారం బాలకార్మికులను పనిలో పెట్టుకున్న దుఖాణ యజమానులపై చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు కార్మిక సహాయ అధికారిణి సారా మార్గరేట్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు దుఖాణాల్లో బాల కార్మికులు ఉన్నారా అనే విషయం తనిఖీలు నిర్వహించి దుఖాణ దారులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన వయస్సుల్లో పనిలో పెట్టుకొని బాలకార్మికులుగా మార్చవద్దని దుఖాణ దారులకు సూచించారు. వ్యాపార సముదాయాలు, మరే ఇతర సంస్థల్లో బాలలచేత పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేద కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు బంగారు లాంటి మీ చిన్నారుల భవిషత్‌ను నాశనం చేయవద్దని, తాత్కాలికంగా వచ్చే సంపాదన కోసం ఆశ పడకుండా ప్రభుత్వం అందించే పథకాలను , అవకాశాలను సద్వినియోగం చేసుకోని తమ చిన్నారులకు ఉజ్వల భవిషత్‌ను అందించాలని కోరారు. అన్ని వర్గాల , ప్రధానంగా బడుగు బలహీన, దారిద్రరేఖకు దిగువనవున్న ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్యనందించాలని ప్రభుత్వం వసతి గృహాలను ఏర్పాటు చేసి పౌష్టికాహారం అందిస్తుందని అన్నారు. అలాగే పాఠశాలల్లో చదుకునేందుకు అవసరమైన పుస్తకాలు, బ్యాగ్‌లు, నోట్‌బుక్స్ తదితర వాటిని ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని అన్నారు. అంతేకాకుండా బాల్య జీవితాలు చదువుకు దూరమై చితిమి పోకుండా తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికం ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని అన్నారు. చట్టాన్ని వ్యతిరేకించి ఎవరైన బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే దుఖాణ యజమానికి రూ. 50వేలు జరిమాన, లేదా సంవత్సరం జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు బాల కార్మికులను నివారించేందుకు బాధ్యత వహించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆళ్ళగడ్డ సహాయ కార్మిక అధికారి మురళీకృష్ణ, నంద్యాల జిల్లా కేంద్రలో ఉన్న బర్డ్స్ సంస్థ బృందం సంపత్, భాస్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారిణి సారా మార్గరేట్

## సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

**ముఖ్యఅతిథిగా హాజరైన మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ వీరం ప్రసాద్ రెడ్డి**

**అధికార పార్టీకే చేస్తారా అంటూ.. ఎమ్మార్వో ను నిలదీసిన తలముడిపి సర్పంచ్**




మాట్లాడుతున్న మార్కెట్ యార్డ్ ఛైర్మెన్

**మిడుతూరు మేజర్ న్యూస్ :** మిడుతూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను చదివారు. మండల వ్యవసాయ అధికారిపీరునాయక్ మాట్లాడుతుండగా సహకార సొసైటీలో రాబోయే రబీకి ముందుగానే నాణ్యమైన విత్త నాలు ఫర్టిలైజర్ ఎక్కువ స్టాక్ ఉంచుకోవాలని రైతులకు కావలసిన వాటిని మార్కెట్ తరపున సహకారం అందిస్తామని ఏఎంసీ చైర్మన్ ప్రసాద్ రెడ్డి ఎంఏఓకు సూచిం చారు. అదేవిధంగా సబ్సిడీ విత్తనాలు ఇంకా ఎక్కువగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని పొగాకు కంపెనీ వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారని కంపెనీ ప్రతినిధులతో మాట్లాడాలని అన్నారు. కరెంట్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యను సరిచేయాలని విద్యుత్ శాఖ ఏఈక్రాంతికుమార్‌కు సూచించారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న రోడ్డు అధ్వానంగా ఉందని అదేవిధంగా పీరు సాహెబ్ పేట రోడ్డు మరియు మిడుతూరు గారేయపురం రోడ్డు గుంతల మయంగా ఉండటంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురి అవుతున్నారని రోడ్లను బాగు చేయాలని మీరు మండలంలో పర్యటించారు. ఎప్పుడో వస్తారు వెళ్తారంటూ ఆర్అండ్ బి ఏఈ మనోధర్ ను ప్రజా ప్రతినిధులు నిలదీశారు. జలకనూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో గతంలో 110 మంది విద్యార్థులు ఉంటే ప్రస్తుతం 47 మంది మాత్రమే ఉన్నారని అందరూ ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని కనీసం పాఠశాలల వైపు చూడాల్సిన బాధ్యత మీకు లేదా అంటూ ఎంఈఓ ఫైజున్నిసా బేగంను గ్రామ సర్పంచ్ కురువ ఎల్లయ్య ప్రశ్నించారు. రాస్తా లేని పొలాలకు రస్తా ఇవ్వమని జీవో వచ్చింది గత ఆరు నెలలుగా తిరుగుతునన్నా పొలాల రస్తాలకు దారి చూపడం లేదుగ్రామంలో లేనిపోని సమస్యలుకు అధికార పార్టీ ఫిర్యాదు చేస్తే హాజరవుతావు ప్రతిపక్షాల కైతే హాజరు కావా అంటూతహసిల్దార్ పై తలముడిపి సర్పంచ్ వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి దశరథ రామయ్య మరియు మండల అధికారులు పాల్గొన్నారు.

## కరాటే క్రీడాకారులకు అభినందించిన బి.సి రాజారెడ్డి

**బనగానపల్లెమేజర్,న్యూస్:** బనగానపల్లెకు చెందిన కరాటే క్రీడాకారులను పట్టణ మాజీ సర్పంచ్ బి.సి రాజారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 21వ తేదీన కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి ఒలంపిక్ డే సంబరాల్లో భాగంగా బనగానపల్లెకు చెందిన జెన్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచి పథకాలు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం బి.సి రాజారెడ్డి కరాటే క్రీడాకారులను అభినందించి వారికి మెడల్స్ సర్టిఫికేట్స్ అందజేసి అభినందించారు. బనగానపల్లె పట్టణంలో విద్యార్థులను కరాటేలో తీర్చిదిద్దుతున్న మాస్టర్లను అభినందించారు. కరాటే పోటీల్లో విద్యార్థులు పాల్గొనేందుకు కృషి చేసిన ఒలంపిక్ అసోషియేషన్ ప్రెసిడెంట్ బి. రామాంజనేయులు, రాష్ట్ర కరాటే అసోషియేషన్ అద్యక్షుడు కోలా ప్రతాప్ కుమార్ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా కరాటే అసోషియేషన్ అద్యక్షులు కళ్యాన్‌బాబు, జనరల్ సెక్రెటరీ, సూర్యవంశి, ట్రెజరర్ చైతన్య రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న బి.సి రాజారెడ్డి

## జీలుగలు, కంది విత్తనాల కొరకు రైతుసేవా కేంద్రాన్ని సంప్రదించండి

**-మండల వ్యవసాయ అధికారిని ప్రమీల**

**-రైతులకు ఉచిత కంది మినికిట్స్ పంపిణీ దృశ్యం**

**దొర్నిపాడు మేజర్ న్యూస్ :** కంది, జీలుగలు కావాల్సిన రైతులు ఆయాగ్రామాలలోని రైతుసేవా కేంద్రాలను సంప్రదించి విత్తనాలను తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని వి ప్రమీల రైతులకు సూచించారు మంగళవారం మండలపరిధిలోని చాకరాజువేముల, బుర్రరెడ్డిపల్లె గ్రామాలలో మండల వ్యవసాయ అధికారిని ప్రమీల ఆధ్వర్యంలోపొలం పిలుస్తోందికార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం లో ఏ ఓ ప్రమీల, వెటర్నరీ డాక్టర్ చిన్నబాబు ఏఐఏసి క్రాఫ్ ఇన్సూరెన్స్ అధికారులు హాజరై వివిధ పంటల గురించి రైతులకు అవగాహనా కల్పించారు ఈ సందర్భంగా ఏ ఓ ప్రమీల మాట్లాడుతూ రైతులకు కందివిత్తనాలను ఉచితంగా రైతులకు అందించడం జరిగింది. అలాగే జీలుగలు కావాల్సిన వారికీ ప్రభుత్వం 50%సబ్సిడీ తో అందివ్వడం జరుగుతుందిఅని ఆమె అన్నారు ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారిని వి ప్రమీల వెటర్నరీ డాక్టర్ చిన్నబాబు ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు పశుసంవర్ధ క శాఖ అధికారులు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



సూర్య
www.suryaa.com

బుధవారం | 25 జూన్ 2025

# ఆత్మకూరులో భారీ దొంగతనం

- 60 తులాల బంగారు, రూ.30 లక్షల నగదు అపహరణ
- రంగంలోకి దిగిన క్లూజ్ టీమ్, సిసిఎస్ పోలీసులు



బీరువాను పగలగొట్టి చోరీకి పాల్పడ్డ దృశ్యం



చోరి జరిగిన ఇంటి వద్ద విచారణ చేపడుతున్న పోలీసులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పట్టపగలే దొంగలు తమ ప్రతాపాన్ని చూపి ఓ ఇంటిలో భారీగా సొమ్ము కాజేసిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని సాయిబాబా నగర్‌లో నివాసముంటున్న జలవనరుల శాఖ ఎఈ శరభారెడ్డి ఇంట్లో భారీ దొంగతనం జరిగింది. శరభారెడ్డి విధుల నిమిత్తం బయటకు పోవడం, అదే సమయంలో కొత్తగా వివాహమైన కూతురు ఫోటో స్యూట్ కోసం బయటకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంటికి చొరబడి ఇంట్లో ఉన్న బీరు తాళాలు కూడా పగల గొట్టి చోరీకి పాల్పడ్డారు. బీరువాలో ఉన్న 60 తులాల బంగారు, రూ. 30 లక్షల నగదును అపహరించారు. ఇంటికి వచ్చిన శరభారెడ్డి తలుపు, ఇంటిలో బీరువా తెరిచి ఉండడాన్ని చూసి దొంగ తనం జరిగినట్లు తెలుసుకొని పోలీసులకు సమాచా రం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీ సులు భారీగా దొంగతనం జరగడంతో బాధితుల ఫిర్యాదు మేరకు ప్రత్యేక బృందాలైన క్లూస్ టీం, సిసిఎస్ పోలీసులను రంగలోకి దించి దర్యాప్తు చేపట్టారు.

# బిసి హాస్టల్‌ను అధికారులు తనిఖీ

## సూర్య కథనానికి జిల్లా అధికారుల స్పందన



సి.బెళగల్ బిసి వసతి గృహాన్ని తనిఖీ చేసిన సంఘిక సంక్షేమ జిల్లా అధికారి శ్రీనివాసులు.

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలానికి సంబందించిన బిసి హాస్టల్ లో నెలకోన్న సమస్యలపై "బిసిహాస్టల్ కు దిక్కెవ్వరు" అనే కథ నం మంగళవారం నేటి దినపత్రిక సూర్యలో ప్రచురించిన సంగతి తెలిసిందే. సూర్య దినపత్రిక కథనానికి జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శ్రీనివాసులు స్పందించి మంగళవారం మండ లంలోని బిసి హాస్టల్ ను తనిఖీ చేశారు.అందులో భాగంగా రికార్డులను పరిశీలించి హాస్టల్ పరిస్థితి పై అరా తీశారు.తొందర లోనే సిబ్బందిని కేటాయిస్తామని తెలిపారు. వర్డెన్ నియామకం జిల్లా ఉన్నతధికారుల పెచ్చిలో ఉందని వీలైంత త్వరగా రెగ్యులర్ వర్డెన్ను నియమిస్తామని,అప్పటివరకు ఇం చార్జి వర్డెన్ గా రమేష్ ను కొనసాగిస్తామాని అయన తెలిపా రు.అప్ప టివరకు విద్యార్థుల పట్ల బాధ్యతతో భద్రత కల్పించి, నాణ్యమై న భోజ నం,వసతి కల్పించాలని ఆదేశించారు.

# బివితో 30 ఏళ్లు కలిసి రాజకీయాలు చెయ్యాలనుకున్నా..!!

- వ్యక్తిగత కారణాలతో తెదేపాను వీడుతున్నా..
- నందవరం మండల నాయకులు దేశాయి గురురాజరావు



విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతున్న గురురాజదేశాయి

**ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** వన్నపనిటైం తనతో కలిసి30 ఏళ్లు రాజకీయాల్లో పయనించాలని సాక్షాత్తు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి జయనాగేశ్వరరెడ్డి బుజం తట్టి మండల కేంద్రం నందవరంలో యువనాయకుడు అయిన తనను రాజకీయాలకు ప్రేరణ కలిగించినటువంటి తన కుటంబం రాజకీయ అరంగ్రేటం చేసిన బివిని, తెదేపాను తన వ్యక్తిగత కారణాలతో వీడిపోతున్నందు కు చాలా భాదగా ఉన్నా కూడా తప్పడంలేదని నందవరం తెదేపా మండల నాయకులు దేశాయి గురురాజరావు తన తెదేపా సభ్యత్వానికి రాజీనామా అందిస్తున్నట్లు మంగళవారం విలేఖర్ల సమావేశంలో వెల్లడించారు. తనతో పాటు మాజీ సర్పంచ్ పార్టీ ఆవిర్భావం నుండి తెదేపాలోనే కొనసాగారు. అయన కూడా పార్టీ సభ్యత్వానికి రాజీనామ అందించడం జరుగుతుందన్నారు. నందవరం మండల కేంద్రంలో 2024 ఎన్నికల్లో 15 వందల మెజార్టీ బివికి అందించడంలో కృషి చేయ్యడం జరిగిందన్నారు. దేశాయి యూత్ అద్యక్షులు సాదీక్ కూడా పార్టీని నేడు వీడనున్నారు. అలాగేఅనిల్ శివ కూడా తనతో పాటు తెదేపాకు రాజీనామ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇలా నాలుగేళ్లు ఇంకా అధికారం అనేది అనుభవించక తెలుగుదేశం పార్టీని ఎందుకు వీడి పోతున్నారు. అనేది క్యాడర్ తీరుపై అంతుపట్టని వైనంగా మారింది.. రాజకీయ విశ్లేషకులు సైతం తలలు పట్టుకుంటున్నారు. ఇటీవలనే ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిల్ టిడిపి ఫ్లోర్ లీడర్ బిజిఆర్ దయాసాగర్ పసుపు కండువా వీడి కషాయం ( గులాభిపార్టీ)కండువ కప్పుకున్నారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ నియామకంతో నందవరం మండలంలో దేశాయి మాదవరావు ఏకంగా ఎమ్మెల్యే బివిపై విమర్శనాస్త్రలు సందించిరు. సొంతగూటి నాయకులు ఇలా విమర్శలు, ప్రశ్నలు గుప్పిస్తున్నా తెదేపా స్థానిక నాయకులు నేరుగా మాట్లడలేక, చోటా నాయకుల చేత పార్టీలో ఉండాలి అనుకుంటే ఉండవచ్చు, వెళ్లాలి అనుకుంటే వెళ్లిపోవచ్చనే సంకేతాలు పంపినా నేటికి మాదవరావు దేశాయి ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. పార్టీని వీడుతారా , లేక అధిష్టానంతో తేల్చుకుంటారా అనేది ఇంకా తేలని విషయం. ఇంతలోనే దేశాయి కుటుంబంలో నుండి రాజకీయాలు విడి విడిగా చేస్తున్న గురురాజ దేశాయి వెంట నలుగురు నాయకులు!టిడిపికి రాజీనామాలు చెయ్యడం జరిగింది. ఇలా రాజీనామాల పర్వం అధికార తెలుగుదేశం పార్టీలో జోరుగా జరుగుతాయనే పుకార్లు లేకపోలేదు. ఇదే బాటలో మరి కొంతమండి సీనియర్ నాయకులు పార్టీని వీడే ఆలోచనలో ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల జరిగిన మహానాడు సమావేశాలు అయితేనేమి, ఇతర సభలతో పాటు వ్యక్తిగతంగా పార్టీ నాయకులకు అందరికి పార్టీకి సేవలు చేసిన వారు కార్యకర్తలు, నాయకులు రుణం తీర్చుకోవాలి అంటున్నారు. కాని నియోజకవర్గం స్థాయిలో అలాంటివి ఎక్కడా అమలు కావడం లేదనే భాద తమ్ముళ్లను పీడిస్తుంది. ఇందుకు కారణాలు ఎన్ని ఉన్నా ప్రతినిధి అందరిని కలుపుకునే తత్వం వీడారనే అరోపణలతో తమ్ముళ్లు పార్టీ వీడి బయటపడుతున్నా ం అంటున్నారు. ముప్పైఏళ్ల రాజకీయాలు కలిసి చెయ్యాలనుకున్న బివి ఆశయంలో పాలుపంచుకోకుండా తెదేపా సభ్యత్వాన్ని ఓ యువనాయకుడు వీడి వెల్లటం ఏమిటని అందరూ ముక్కన వేలేసుకుంటున్నారు.

# యాగంటి దేవస్థానం నూతన ఈవోగా పాండురంగారెడ్డి



**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్ః** బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానం ఇంచార్జి కార్యనిర్వహణ అధికారిగా పాండురంగారెడ్డిని నియమించారు. ఈ మేరకు మంగళవారం ప్రస్తుత ఈ.ఒ బి. చంద్రుడు నుంచి నూతన ఈ.ఒ పాండురంగారెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన బేతంచెర్ల మండలంలో శ్రీ ఘన మద్దులేటి స్వామి దేవస్థానం ఈ.ఒగా పనిచేసి దేవస్థానం అభివృద్ధికి కృషి చేశారు.

# త్రిబుల్ ఐటికి మహాత్మ జ్యోతిబాపూలే విద్యార్థినీలు ఎంపిక



త్రిబుల్ ఐటికి ఎంపికైన మహాత్మజ్యోతిబాపూలే బీసి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినీలు

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ః** వెల్దుర్తి మండల కేంద్ర సమీపంలో ఉన్నటువంటి మహాత్మజ్యోతిబాపూలే బీసి బాలికల గురుకుల పాఠశాల నుండి దాదాపు 13 మంది త్రిబుల్ ఐటికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ షబానాబేగం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ షబానాబేగం మాట్లాడుతూ బోయ మహేశ్వరీ, గంగసాని హాసినీ, తణగల కేశమ్మ, ఎం.అర్షితవర్షిణీ, ముందరింటి సింధూ, ఎం.సౌమ్య, గొల్ల జోష్నా, దొడ్డి భార్గవీ, యుజి.వర్షిణీ, గొల్ల నాగమల్లికలు ఆర్‌కె వ్యాలీ, గంట ఈడిగ నందినీ నూజివీడు, ఉప్పరి అఖిల శ్రీకాకుళం, పత్తికొండ దివ్యశ్రీ ఒంగోలు త్రిబుల్ ఐటికి ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు.

# సమయ పాలన పాటించని సచివాలయ సిబ్బంది

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సచివాలయ సిబ్బంది
- పట్టించుకోని అధికారులు




తలుపులు మూసిన వగరూరు సచివాలయం

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వగరూరు గ్రామ సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. మంగళవారం 11గంటల సమయమైన సచివాలయం తలుపులు తెరిచే వారేలేరని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయంలో ఏనిమిది మంది సిబ్బంది పనిచేస్తున్నారు. గత మంగళవారం కూడ ఒక్కరు మాత్రమే హాజరైన సంఘటన చోటు చేసుకొంది. పని నిమిత్తం చాలామంది సచివాలయానికి వచ్చి వెను తిరిగి వెళ్తున్నారు. చాలామందికి తల్లికి వందనం పథకం డబ్బులు జమ కాని వారు కుల, ఆదాయం, రేషన్‌కార్డుల కోసం, సర్టిఫికెట్లకోసం, ఆర్ఓఆర్ ఆడంగల్ కోసం సచివాలయానికి వస్తున్నారు. తమ పొలం పనులు వదిలి సచివాలయం చుట్టు కాల్లు అరిగేలా తిరిగినా పనులు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బందికి ఎన్నిసార్లు ఫోన్‌చేసినా వాళ్లు ఫోన్లు ఎత్తకుండా,ఎత్తిన కూడ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారన్నారు. సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఈ విషయం ఎంపిడిఓ దృష్టికి వినతిపత్రం రూపంలో తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు అన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు సిబ్బందిపై చర్యలు తీసుకొని సమయ పాలన పాటించే విధంగా చూడాలని గ్రామస్థులు కోరారు. ఈ విషయంపై మంత్రాలయంరూరల్ రిపోర్టర్ మేజర్ న్యూస్ ఫోన్లో ఎంపిడిఓ నూర్జాహాన్‌ను సంప్రదించగా, స్పందించలేదు.

# కొత్తగా నిర్మించిన రేకుల షెడ్డుకు ఆర్థిక సహాయం

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ నందు కొత్తగా నిర్మించిన రేకుల షెడ్డుకు రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని 1997-98 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు స్కూల్ హెచ్‌ఎం రామకృష్ణ హెడ్డెకు అందజేశారు. మంగళవారం పులి గోవర్ధన్‌రెడ్డి మిత్ర బృందం తాము చదివిన స్కూల్‌కు ఏదైనా చేయాలనే ఆలోచనతో రేకుల షెడ్డుకు ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్‌ఎం, సిబ్బంది పూర్వ విద్యార్థులను అభినందించారు.